సాక్షి
రంగారెడ్డి
గురువారం । 17 । ఏప్రిల్ । 2025



అకాల వర్షం..

అకాల వర్షాల కారణంగా పంటలు దెబ్బతినడంతో రైతన్నలు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. 8లో ▸



ఆక్రమణల తొలగింపు

చేవెళ్లలో జాతీయ రహదారిపై ఆక్రమిత కట్టడాలను తొలగించాలని టీపీఓ మణిహారిక హెచ్చరించారు. 8లో ▸



అప్రమత్తతే ముఖ్యం

జాతీయ అగ్ని ప్రమాద నివారణ వారోత్సవాల సందర్భంగా అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

ఆర్‌ఎంపీలు, పీఎంపీలను నియంత్రించండి

డీఎంహెచ్‌ఓకు ఐఎంఏ సభ్యుల వినతి



డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్‌రావుతో మాట్లాడుతున్న ఐఎంఏ షాద్‌నగర్ బృందం

షాద్‌నగర్: ఆర్‌ఎంపీలు, పీఎంపీలను నియంత్రించాలని కోరుతూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) సభ్యులు బుధవారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఐఎంఏ షాద్‌నగర్ అధ్యక్షుడు డాక్టర్ నాగవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో డీఎంహెచ్‌ను కలిసిన వైద్యులు ఎలాంటి అర్హత లేకుండా, ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా షాద్‌నగర్‌లో ఆర్‌ఎంపీలు చికిత్సలు చేస్తున్నారని వారిని నియంత్రించాలని కోరారు. కేవలం ప్రథమ చికిత్సలు మాత్రమే నిర్వహించాల్సి ఉండగా నిబంధనలకు విరుద్ధంగా క్లినిక్‌లు, ఆస్పత్రులు నిర్వహిస్తున్నట్లు ఆయనకు వివరించారు. వారిని నియంత్రించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

రైతు వేదికకు కేటాయించిన భూమిని కాపాడండి



తహసీల్దార్ గోపాల్‌కు వినతిపత్రం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కందుకూరు: ప్రభుత్వం రైతు వేదిక నిర్మాణానికి కేటాయించిన భూమిలో కొంత మేర ప్రైవేట్ వ్యక్తులు కబ్జా చేసి ప్లాట్లు చేశారని.. సర్వే చేసి ఆ భూమిని కాపాడాలని కాంగ్రెస్ నాయకులు తహసీల్దార్‌ను కోరారు. ఈ మేరకు కాంగ్రెస్ అధ్యక్షుడు బొక్క సంజీవరెడ్డి, నాయకుడు ఎస్.శేఖర్‌గౌడ్ తదితరులు తహసీల్దార్ గోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ భూమిని కబ్జా చేయడంతో పాటు పిల్లి వాగును సైతం వెంచర్ నిర్వాహకులు తమ ఇష్టానుసారంగా మార్పులు చేశారన్నారు. విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. వారి వెంట ఖదీర్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి



సమావేశంలో మాట్లాడుతున్న ఆచారి

ఆమనగల్లు: ప్రజా సమస్యలపై బీజేపీ నిరంతర పోరాటం చేస్తోందని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి అన్నారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మండల పరిధిలోని అన్ని గ్రామాల బీజేపీ క్రియాశీల సభ్యుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆచారి మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం కోసం బీజేపీ ప్రత్యేక పథకాలు అమలు చేస్తోందన్నారు. కార్యకర్తలు ఇంటింటికి వెళ్తూ పార్టీ పథకాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపుకో నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఆయన సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని ఆరోపించారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కండె హరిప్రసాద్, మాజీ సభ్యుడు రాంరెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మున్సిపల్ అధ్యక్షుడు కర్నాటి విక్రంరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు చెక్కల లక్ష్మణ్, మాజీ కౌన్సిలర్‌లు విజయ్‌కృష్ణ, చెన్నకేశవులు, సుండూరి శేఖర్, కృష్ణనాయక్, కృష్ణయాదవ్, బీజేపీ నాయకులు రవిరాథోడ్, ప్రశాంత్, మహేశ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని సరెండర్

సాక్షి, రంగారెడ్డి జిల్లా: విధి నిర్వహణలో నిర్లక్ష్యం, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి సంధ్యారాణిని సరెండర్ చేస్తూ కలెక్టర్ నారాయణరెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆమెను మహిళా శిశు సంక్షేమ శాఖకు సరెండర్ చేశారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారిగా పని చేస్తున్న శ్రీలతకు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

భూముల రక్షణకే 'భూ భారతి'

నేటి నుంచి 30 వరకు చట్టంపై అవగాహన సమావేశాలు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన భూ భారతి చట్టానికి సంబంధించిన పోర్టల్‌ను అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఈ నెల 14న ఆవిష్కరించి రైతులకు అంకితం చేసింది. జూన్ 2 నుంచి పోర్టల్ అమలు చేసేందుకు సన్నాహకాలు చేస్తున్న సర్కార్ ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించేందుకు మండలాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేస్తోంది.

- కమతాలకు భూధార్ నంబర్ల కేటాయింపు
- వాటి ఆధారంగానే సంక్షేమ ఫలాలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు తీసుకొచ్చిన 'భూ భారతి'పథకాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా గురువారం నుంచి ఈ నెల 30 వరకు మండలాల వారీగా రికార్డ్ ఆఫ్ రైట్స్(ఆర్‌ఓఆర్)–2025 భూమి హక్కుల రికార్డు, ధరణి స్థానంలో కొత్తగా తీసుకురాబోతున్న భూ భారతి, ఆర్‌ఓఆర్‌లో తప్పుల సవరణ, వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్, మ్యూటేషన్, వారసత్వ భూముల మ్యూటేషన్, సేల్‌డీడ్ ఇతర మార్గాల ద్వారా వచ్చిన మ్యూటేషన్, సాదా బైనామాల క్రమబద్ధీకరణ, పట్టాదారు పాసుపుస్తకాలు, అప్పీల్ వ్యవస్థ, రివిజన్ అధికారాలు, న్యాయ సహాయం, గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణ వంటి అంశాలపై అవగాహన కల్పించనున్నారు. రెవెన్యూ రికార్డులను పక్కాగా నిర్వహించడంతో పాటు భూములకు (కమతం) ఆధార్ తరహాలో భూధార్ నంబర్ కేటాయింపు సహా ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు సైతం ఈ నంబర్ల ఆధారంగానే అందనున్నాయి. భూ రికార్డుల నిర్వహణలో ఎలాంటి వివాదాలకు ఆస్కారం ఇవ్వొద్దని నిర్ణయించింది. ఆర్డీఓ, తహసీల్దార్ సహా సెక్షన్ అధికారులు ఈ సమావేశాల్లో పాల్గొని, రైతులు, భూ యజమానుల్లోని అనుమానాలను నివృత్తి చేయనున్నారు. తద్వారా రెవెన్యూ శాఖపై సృష్టించిన అపవాదులను పూర్తిగా తొలిగించుకోవాలని యోచిస్తోంది.

రిజెక్ట్ చేస్తే.. కారణం చెప్పాల్సిందే

జిల్లా వ్యాప్తంగా 12,43,035 ఎకరాల భూములు ఉన్నాయి. వీటిలో 64,803 ఎకరాల అటవీ



భూములు ఉండగా 8,86,705 ఎకరాల సాగు భూములు ఉన్నాయి. 2,26,509 ఎకరాల వ్యవసాయేతర భూములు ఉన్నాయి. 1,89,406 ఎకరాలు తోటలు, చెట్లతో నిండి ఉంది. 59,906 ఎకరాలు సాగుకు యోగ్యం కానీ భూములున్నాయి. ప్రభుత్వ, భూదాన్, వక్ఫ్, సీలింగ్, లావణి, అటవీ భూములతో పాటు ప్రైవేటు పట్టా భూములు ఉన్నాయి. నగరానికి సమీపంలో జిల్లా ఉండడం, ఐటీ, అనుబంధ సంస్థలతో పాటు రియల్ ఎస్టేట్ రంగం పెట్టుబడులు ఇక్కడ భారీగా పెడుతుండటంతో జిల్లాలోని భూములకు రెక్కలొచ్చాయి. దీంతో పాటు సరిహద్దు వివాదాలు కూడా అధిక మయ్యాయి. భూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2020 నవంబర్‌లో ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చింది. ఇప్పటి వరకు రెండు లక్షలకుపైగా దరఖాస్తులు పోర్టల్‌లో నమోదు కాగా, ఇప్పటికే 1.80 వేల దరఖాస్తులను క్లియర్ చేయగా.. ప్రస్తుతం 17,646 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. వీటిలో 7,966 దరఖాస్తులు తహసీల్దార్ల వద్ద, 3,351 దరఖాస్తులు ఆర్డీఓల వద్ద, అదనపు కలెక్టర్ వద్ద 4,877 దరఖాస్తులు, కలెక్టర్ వద్ద 1,452 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. గతంలో దరఖాస్తు తిరస్కరిస్తే. కారణం చెప్పేవారు కాదు. ప్రస్తుతం అమల్లోకి తెచ్చిన భూ భారతిలో అప్పీల్ వ్యవస్థను ప్రవేశపెట్టింది. ఇప్పటికే రాష్ట్రంలోని పలు మండలాలను పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసి, వివాదాలు లేకుండా భూముల రికార్డులను పక్కాగా నిర్వహిస్తోంది. త్వరలోనే ఇతర జిల్లాల్లోనూ ఈ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ప్రకటించింది. ముందస్తుగా కొత్తగా అమల్లోకి తీసుకురాబోతున్న ఈ భూ భారతి చట్టంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని నిర్ణయించి ఆ మేరకు మండలాల వారీగా సదస్సులు నిర్వహిస్తోంది.

సదస్సుల సమాచారం

తేదీ	మండలం
17	షాద్‌నగర్, కేశంపేట
19	ఆమనగల్లు, తలకొండపల్లి
21	చేవెళ్ల, శంకర్‌పల్లి
22	కొందుర్గు, చౌదరిగూడ
23	మాడ్గుల, యాచారం
24	మెయినాబాద్, షాబాద్, గండిపేట్
25	మంచాల, ఇబ్రహీంపట్నం
26	కొత్తూరు, నందిగామ, శంషాబాద్
28	అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్, సరూర్‌నగర్
29	మహేశ్వరం, కందుకూరు, కడ్తాల్
30	శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, బాలాపూర్

చేవెళ్ల పీఎస్‌కు జీవన్‌రెడ్డి

- విచారణకు హాజరైన బీఆర్‌ఎస్ నేత
- పలు అంశాలపై రెండున్నర గంటల పాటు ప్రశ్నించిన పోలీసులు



చేవెళ్ల ఠాణాలో విచారణకు హాజరై బయటకు వస్తున్న మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

చేవెళ్ల: మండల పరిధిలోని ఈర్లపల్లి భూములకు సంబంధించిన కేసులో ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నేత జీవన్‌రెడ్డి చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. సీఐ భూపాల్‌రెడ్డి బుధవారం ఆయన్ను రెండున్నర గంటల పాటు విచారించారు. శంకర్‌పల్లి మండలం టంగటూరు, చేవెళ్ల మండలం ఈర్లపల్లి గ్రామాల పరిధిలోని తనకున్న 170 ఎకరాల భూమిని కబ్జాచేసి ఆక్రమించుకున్నాడని సామ దామోదర్‌రెడ్డి అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు జీవన్‌రెడ్డితో పాటు అతని కుటుంబ సభ్యులపై మోకిల, చేవెళ్ల పీఎస్‌లలో 2024మే 22, 27 తేదీల్లో కేసులు నమోదయ్యాయి. దీనిపై జీవన్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించగా ఆయన తల్లి రాజుబాయి, భార్య రజితకు బెయిల్ మంజూరైంది. జీవన్‌రెడ్డికి బెయిల్ రాకపోవటంతో సుప్రీం కోర్టును ఆశ్రయించారు. దీంతో జీవన్‌రెడ్డిని అరెస్ట్ చేయొద్దని, ఆయన విచారణకు సహకరించాలని సర్వోన్నత న్యాయస్థానం సూచించింది. ఇప్పటికే మూడుసార్లు మోకిల పీఎస్‌లో విచారణకు హాజరైన జీవన్‌రెడ్డి రెండోసారి చేవెళ్ల పీఎస్‌కు వచ్చారు. రెండున్నర గంటల పాటు సుదీర్ఘ విచారణ కొనసాగింది. ఈర్లపల్లి పరిధిలో ఉన్న 14.30 ఎకరాల భూమికి సంబంధించి జీవన్‌రెడ్డిని పలు ప్రశ్నలు అడగ్గా ఆయన కొన్నింటికి సమాధానాలు చెప్పడంతో పాటు కొన్ని కోర్టు పరిధిలో ఉన్నాయంటూ దాటవేసినట్లు తెలిసింది.

కక్ష సాధింపు..

జీవన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలకులు తనపై కక్షసాధింపు ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కేవలం రాజకీయ దురుద్దేశంతోనే తనను విచారణ పేరిట పోలీస్ స్టేషన్ల చుట్టూ తిప్పుతున్నారని తెలిపారు.

అవసరమైతే మళ్లీ పిలుస్తాం

సీఐ భూపాల్ శ్రీధర్ మాట్లాడుతూ.. ఈర్లపల్లిలోని దామోదర్‌రెడ్డికి సంబంధించిన 14.30 ఎకరాల భూమిని కబ్జా చేయడంతో పాటు కాంపౌండ్ ధ్వంసం చేసి బెదిరింపులకు పాల్పడుతున్నాడనే కేసు విచారణలో భాగంగా జీవన్‌రెడ్డిని పిలిపించామన్నారు. కేసుకు సంబంధించిన పలు విషయాలను అడిగి తెలుసుకున్నామని, ఈ సమాధానాలతో కేసును పరిశీలిస్తామని, అవసరమైతే మళ్లీ విచారణకు పిలుస్తామని సీఐ చెప్పారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

శంకర్‌పల్లి: అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ సమస్యలను గుర్తించి పరిష్కరించాలని శంకర్‌పల్లి ఎంపీడీఓ వెంకయ్య అన్నారు. బుధవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి సురేశ్‌బాబుతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో వందశాతం ఆస్తిపన్ను వసూలు చేయాలని.. ఇందిరమ్మ ఇళ్లకు అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వివరాలు సేకరించాలన్నారు. వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.



ఆదిబట్లలో ఇసుక బజార్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇంటి వద్దకే ఇసుక

- దోపిడీని అరికట్టేందుకే సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం
- 'ఇసుక బజార్'లను సద్వినియోగం చేసుకోవాలి
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఇసుక దోపిడీని అరికట్టేందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపడుతోందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆదిబట్ల మున్సిపల్ కేంద్రంలో బుధవారం 'ఇసుక బజార్'ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఖనిజాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఇసుక బజార్ కొనసాగుతుందని తెలిపారు. దోపిడీ, దళారీ వ్యవస్థను రూపుమాపేందుకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వీటిని అందుబాటులోకి తీసుకువస్తున్నారని స్పష్టం చేశారు. అబ్దుల్లాపూర్‌మెట్, ఆదిబట్లలో ఇప్పటికే ఇవి కొనసాగుతున్నాయని వెల్లడించారు. ప్రజాపాలనలో భాగంగా ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ఇసుకు కొరత లేకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో రెచ్చిపోయిన ఇసుక మాఫియా, అమాయకులపైకి లారీలు, ట్రాక్టర్లు ఎక్కించిన విషయం ప్రజలు మర్చిపోలేదన్నారు. స్టాక్ పాయింట్ల వద్ద సన్న రకం టన్నుకు రూ.1,800, దొడ్డు రకానికి రూ.1,600 చెల్లిస్తే ఇసుక ఇంటికే వస్తుందని తెలిపారు.

కబ్జాలను సహించేది లేదు

ప్రభుత్వ భూములను కబ్జా చేసే వారిని ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఆదిబట్ల ప్రాంతం భవిష్యత్‌లో బంగారు గనిగా మారుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ కృషితోనే టీసీఎస్, ఏరోస్పేస్‌తో పాటు ఇతర సంస్థలు నెలకొల్పారని, ఇది దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పుణ్యమేనని గుర్తుచేశారు. ప్రజలు భూములు అమ్ముకోవద్దని సూచించారు. కలెక్టరేట్ సమీపంలోని భూములతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

అందుబాటులో లారీలు

తెలంగాణ ఖనిజాభివృద్ధి శాఖ ఎండీ సుశీల్‌కుమార్ మాట్లాడుతూ.. ఇసుక తరలించడానికి ప్రభుత్వం వద్ద 1,600 లారీలు ఉన్నాయని, ఇవి 24 గంటల పాటు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్, ఆదిబట్ల మున్సిపల్ మాజీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మహిపాల్, మాజీ సర్పంచ్ ఈసీ శేఖర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ పాండురంగారెడ్డి, యాచారం మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, మహిపాల్‌రెడ్డితో పాటు మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, సీఐ రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుకు ప్రోత్సాహం

వ్యవసాయ శాఖ ఏడీఏ అరుణ

మంచాల: రైతులు ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు ఆర్జించాలని వ్యవసాయ శాఖ ఏడీఏ అరుణ, ఆయిల్ వాల్యూ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ రామ్మోహన్ అన్నారు. బుధవారం ఆరుట్ల రైతు వేదిక భవనంలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చునని.. ప్రభుత్వం సైతం సబ్సిడీలు, ప్రోత్సాహకాలు అందజేస్తోందన్నారు. మండల పరిధిలో 113 ఎకరాల్లో సాగు చేపట్టారని.. ఆసక్తి ఉన్న రైతులు సాగుకు ముందుకు రావాలని సూచించారు. ఈ సాగు చేపట్టిన రైతులకు ప్రభుత్వం ఇప్పటికే రెండు విడతలుగా రూ.8,400 బ్యాంక్ ఖాతాలో జమ చేసిందని చెప్పారు. డిప్పు పరికరాలకు 90 శాతం సబ్సిడీ అందజేస్తుందన్నారు. ఎరువులకు ఎకరాకు రూ.4,200 చొప్పున నాలుగు సంవత్సరాలకు రూ.16,800 ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. ప్రస్తుతం టన్ను పామాయిల్ గెలలకు రూ.21 వేల మద్దతు ధర ఉందని.. ఎకరాకు పది టన్నుల పైనే దిగుబడి వస్తుందన్నారు. ఉద్యాన అధికారి నవీన, ఏఈఓలు సాయివాణి, లింగస్వామి, ఆయిల్ వాల్యూ కంపెనీ ఏరియా మేనేజర్ ప్రమోద్‌కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ వికాస్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేకు ససేమిరా!

- భూ సేకరణ పరిహారం ఓ చోట.. కబ్జా మరో చోట
- ఉద్రిక్తతకు దారి తీస్తోన్న ఫెన్సింగ్ పనులు
- ఫార్మాకు ఇవ్వని భూములను సర్వే ఎలా చేస్తారంటూ రైతుల ఆగ్రహం
- ఆర్డీఓ ఆదేశాల మేరకు తాడిపర్తి భూముల్లో సర్వే





తహసీల్దార్ అయ్యప్పకు సమస్య వివరిస్తున్న తాడిపర్తి గ్రామ రైతులు (ఇన్‌సెట్‌లో) సర్వే నంబర్ 109లో ఫార్మాకు ఇవ్వని పట్టా భూమి

యాచారం: తాడిపర్తి గ్రామంలో పట్టా భూముల సరిహద్దు పంచాయితీ తీవ్ర ఉద్రిక్తతకు దారితీస్తోంది. మూడు రోజులుగా సర్వే, ఫెన్సింగ్ పనులకు రైతులు అభ్యంతరం తెలుపుతున్నారు. ఈ గందరగోళం నేపథ్యంలో రైతులు తమ సమస్యను ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రైతు కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని ప్రాధేయపడుతున్నారు. గ్రామంలోని సర్వే నంబర్ 104లో 516 ఎకరాలు. 109లో 377 ఎకరాలు, 114లో 420 ఎకరాలు, 118లో 476 ఎకరాల పట్టా భూమి ఉంది. సర్వే నంబర్ 104లో 250 ఎకరాలు భూదాన్ భూమి ఉండగా 78 మంది స్థానికేతరులకు 169 ఎకరాల భూమికి పరిహారం ఇచ్చారని ఆరోపిస్తున్నారు. అదే సర్వే నంబర్‌లో 53 ఎకరాల్లో అటవీ భూమి, 24 ఎకరాల్లో బంధం చెరువు, పోచమ్మ ఆలయానికి మరో ఐదెకరాలు వదిలేశారని వివరించారు.

సర్వేతో వెలుగులోకి వచ్చిన మోసం

సర్వే నంబరు 104లో భూమికి పరిహారం చెల్లించగా ప్రస్తుతం ఆ భూమి 109, 114, 118 సర్వే నంబర్లల్లో కబ్జా చూపిస్తోంది. దీంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమైంది. మా భూములను ఫార్మాకు ఇవ్వలేదు.. పైసా పరిహారం తీసుకోలేదు.. ఏళ్లుగా కబ్జాలో ఉన్న పట్టా భూముల్లో సర్వేలు, ఫెన్సింగ్ పనులు ఎలా చేపడతారంటూ రైతులు పనులను అడ్డుకుంటున్నారు. ఈ మేరకు బుధవారం యాచారం తహసీల్దార్ అయ్యప్ప ఆధ్వర్యంలో 104తో పాటు 109, 114, 118 సర్వే నంబర్లల్లోని పట్టా భూముల కబ్జాను సర్వే చేపట్టారు. ఆయా సర్వే నంబర్ల పట్టా భూముల పక్కన అటవీ భూమి ఉండడంతో అటవీ శాఖ అధికారులు సైతం వారి హద్దులను చూపారు.

అక్రమార్కులతో అధికారుల కుమ్మక్కు?

సర్వే చేపట్టకుండా స్థానికేతరులకు పరిహారం ఎలా ఇచ్చారని తాడిపర్తి రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అప్పట్లో కొంతమంది అధికారులు అక్రమార్కులతో కుమ్మక్కై ఎకరాకు రూ.12.50లక్షల చొప్పున స్థానికేతరులకు పరిహారం ఇచ్చారంటూ రైతులు హైకోర్టు, సీసీఎల్ఏ, కలెక్టర్లకు ఫిర్యాదులు చేసినా ఫలితం దక్కలేదు. ప్రస్తుతం అదే సమస్యగా మారింది. రైతులు పనులను అడ్డుకుంటుండడంతో ఏసీపీ కేపీవీ రాజు, గ్రీన్ ఫార్మాసిటీ సీఐ కృష్ణంరాజు అక్కడే మకాం వేసి పర్యవేక్షిస్తున్నారు.

రైతులకు న్యాయం చేస్తాం



తాడిపర్తి రైతుల వాదనలో వాస్తవం ఉందని గుర్తించాం. 104, 109, 114, 118 సర్వే నంబర్లలో పట్టా భూమిని సర్వే చేస్తున్నాం. అటవీ శాఖ, రెవెన్యూ, సర్వే, టీజీఐఐసీ అధికారులు ఆధ్వర్యంలో సర్వే కొనసాగుతోంది. సర్వే అనంతరం నివేదికను ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డికి అందజేస్తాం. రైతులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తాం. రైతులు ఆందోళన చెందొద్దు. పనులు అడ్డుకోవద్దు.

– అయ్యప్ప, తహసీల్దార్ యాచారం

ఇళ్ల స్థలాల్లోకి పేదలను అనుమతించండి

- రామోజీ ఫిలింసిటీ ఆక్రమణలో ఉన్న భూముల చెర విడిపించండి
- సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య
- రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబుకు వినతిపత్రం



రాచకొండ సీపీ సుధీర్‌బాబును కలిసిన సీపీఎం నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: రామోజీ ఫిలింసిటీ ఆక్రమణలో ఉన్న ఇళ్ల స్థలాల కబ్జా కోసం లబ్ధిదారులకు సహకరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి సమక్షంలో బుధవారం రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఫిలింసిటీ చెరలో ఉన్న పేదల భూములకు విముక్తి కల్పించాలన్నారు. గతంలో నిరుపేదలకు ప్రభుత్వం అందజేసిన ఇళ్ల స్థలాలను స్వాధీనం చేసుకునేందుకు పర్మిషన్ ఇవ్వాలని కోరారు. శాంతియుతంగా ఇంటి నిర్మాణ పనులు చేసుకుంటామని, ఇందుకు సహకరించాలని కోరారు. దీనిపై సీపీ స్పందిస్తూ ఇంటి స్థలాల అంశంపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని, త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సామేలు, మండల కార్యదర్శి సీహెచ్ బుగ్గరాములు, ఇంటి స్థలాల పోరాట కమిటీ కన్వీనర్ పి.జగన్, మండల కమిటీ సభ్యుడు ఆనంద్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లలో అధికారుల తనిఖీలు



నిల్వ ఉంచడంతో పాడైన చికెన్ ముక్కలు

- కుళ్లిన ఆహార పదార్థాల వినియోగంపై ఆగ్రహం

చేవెళ్ల: మండల కేంద్రంలో ఉన్న పలు హోటళ్లలో మున్సిపల్ అధికారులు బుధవారం ఉదయం తనిఖీలు చేపట్టారు. కుళ్లిన ఆహార పదార్థాలు గుర్తించి యాజమాన్యానికి జరిమానా విధించారు. మున్సిపాలిటీ అధికారులు రమేశ్, రాఘవేందర్, అమర్, తదితరులు పట్టణ కేంద్రంలోని ఎంజీ ఫుడ్ కోర్టులో(హోటల్) ఆకస్మికంగా సోదాలు చేశారు. అక్కడ కుళ్లిన ఆహార పదార్థాలు(చికెన్, గుడ్లు) కనిపించాయి. ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన వాటిని గుర్తించి పారబోయించారు. అపరిశుభ్రంగా ఉండటంతో హోటల్ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతోపాటు రూ.5వేల జరిమానా విధించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే చర్యలు తప్పవని, హోటళ్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు. నిత్యం ఆకస్మికంగా హోటళ్లను తనిఖీలు చేస్తుంటామని పేర్కొన్నారు.

ఒప్పందం కుదిరేనా!

మెట్రో రెండో దశపై జైకాతో సంప్రదింపులు

- సీఎం రేవంత్‌తో పాటు జపాన్ పర్యటనలో మెట్రో ఎండీ

సాక్షి, సిటీబ్యూరో: మెట్రో రెండోదశ నిర్మాణానికి నిధుల సమీకరణకు రాష్ట్ర సర్కారు జైకా (జపాన్ ఇంటర్నేషనల్ కో–ఆపరేషన్ ఏజెన్సీ)తో సంప్రదింపులు జరుపుతోంది. ఇందులో భాగంగా ఆ సంస్థతో రుణ అంశంపై చర్చించేందుకు హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి జపాన్ పర్యటనకు వెళ్లారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం నుంచి జపాన్‌లో పర్యటిస్తున్నందున.. ఇదే సమయంలో జైకాతో సమావేశం నిర్వహించేలా షెడ్యూల్ ఖరారైంది. ఈ సమావేశంలో నిధుల విడుదల వ్యవహారం కొలిక్కి వచ్చే అవకాశముంది. మెట్రో రెండో దశ నిర్మాణానికి నిధులు అందజేసేందుకు జైకా సూత్రప్రాయంగా అంగీకరించింది. తాజాగా సీఎం జపాన్ పర్యటనలో భాగంగా మరోసారి జైకా ప్రతినిధుల బృందంతో సమావేశమై నిధుల విడుదలపై పరస్పర ఒప్పందం కుదుర్చుకునే అవకాశం ఉన్నట్లు మెట్రో అధికారులు తెలిపారు. తద్వారా మెట్రో రెండో దశకు నిధులను అందజేసేందుకు జైకా సిద్ధంగా ఉన్న దృష్ట్యా కేంద్రం నుంచి సావరిన్ గ్యారంటీ లభించేందుకు ఒత్తిడి చేసేందుకు అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు.

నిధుల సేకరణంలో భాగంగా..

మెట్రో రెండో దశలో మొదట ప్రతిపాదించిన 5 కారిడార్‌లలో 76.4 కిలోమీటర్ల మెట్రో నిర్మాణానికి సుమారు రూ.24,269 కోట్లు వ్యయం కానున్నట్లు అంచనా. ఇందులో ప్రైవేట్ సంస్థల నుంచి 52 శాతం నిధులను సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అంటే.. సుమారు రూ.12,726 కోట్లు జైకా వంటి సంస్థల నుంచి రుణాలుగా తీసుకోవాల్సి ఉంటుంది. మిగతా వ్యయంలో 30 శాతం నిధులు అంటే రూ.7,313 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుంది. మరో 18 శాతం నిధులను (రూ.4,230 కోట్లు) కేంద్రం భరించాల్సి ఉంటుంది. అలాగే మెట్రో స్టేషన్లలో మౌలిక సదుపాయాలతో పాటు పలు పనులను పీపీపీ విధానంలో చేపట్టాలని ప్రతిపాదించారు. ప్రైవేట్ సంస్థల నుంచి నిధుల సేకరణలో భాగంగా సీఎం జపాన్ పర్యటనలో జైకాతో సంప్రదింపుల్లో హెచ్ఏఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి కీలకంగా వ్యవహరించనున్నారు.

జపాన్ రవాణాపై అధ్యయనం..

ఈ పర్యటనలో భాగంగా జపాన్‌లోని వివిధ మెట్రోపాలిటన్ నగరాల్లో వినియోగంలో ఉన్న ప్రజారవాణా సదుపాయాలను సీఎం బృందం అధ్యయనం చేయనుంది. జపాన్‌లోని కోబ్, క్యోటో, నగోయా, ఒసాకా, సప్పోరో, సెండాయ్, టోక్యో, యొకోహామా తదితర నగరాల్లో సబ్‌వే వ్యవస్థలు ఉన్నాయి. ప్రయాణికుల రద్దీకనుగుణంగా మెట్రోపాలిటన్ ప్రాంతాలను క్రాస్ చేసే సబర్బన్ కమ్యూటర్ రైల్వే సదుపాయం అక్కడ ఉంది. అలాగే అనేక నగరాల్లో స్ట్రీట్‌కార్, మోనోరైల్ నెట్‌వర్క్‌లు అందుబాటులో ఉన్నాయి. అర్బన్ ర్యాపిడ్ రైల్ సిస్టమ్, ఆటోమేటెడ్ గైడ్‌వే ట్రాన్సిట్ (ఏజీటీ), ఆటోమేటెడ్ పీపుల్ మూవర్, (ఏపీఎం), లైట్‌రైల్ ట్రాన్సిట్ (ఎల్ఆర్‌టీ), ట్రామ్, సిటీబస్ వంటి సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. మెట్రో రైల్ విస్తరణతో పాటు అర్బన్ ట్రాన్స్‌పోర్టేషన్‌కు అనుగుణమైన ప్రజారవాణాపై ఈ అధ్యయనంలో దృష్టి సారించనున్నట్లు అధికారులు తెలిపారు.



ఆగిర్యాలలో నేలరాలిన ధాన్యం గింజలు



రాలిన మామిడిని పరిశీలిస్తున్న అధికారులు



దెబ్బతిన్న వరి పంటను చూపుతున్న రైతన్న

అకాల వర్షం.. మిగిలిన నష్టం

- వడగళ్ల వానలకు నేలరాలిన వరి, మామిడి
- పంటలను పరిశీలించిన అధికారులు



దేవునిపల్లిలో దెబ్బతిన్న బొప్పాయి పంటను పరిశీలిస్తున్న హెచ్ఓ హిమబిందు

కొందుర్గు: అకాల వర్షానికి పంటలు దెబ్బతినడంతో రైతన్నలు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. మంగళవారం కొందుర్గు మండలంలోని ఆగిర్యాల, వెంకిర్యాల, లక్ష్మీదేవిపల్లి, ఫరూఖ్‌నగర్ మండలం దేవునిపల్లి తదితర గ్రామాల్లో వడగళ్ల వానలకు వరి పంట పూర్తిగా దెబ్బతిందని ఆయా అన్నదాతలు వాపోతున్నారు. ఆరుగాలం కష్టపడి చాలీచాలని నీటిని రాత్రింబవళ్లు పొలానికి పెట్టి పండించిన పంట నేలపాలు కావడంతో విలవిలల్లాడుతున్నారు. ఆగిర్యాలకు చెందిన చింపోడి మొగులయ్య, పందిబండ రామచంద్రయ్య, గుమ్మడి వెంకటయ్య, గుమ్మడి రామచంద్రయ్య, మహదేవ్‌పూర్ రాములు, నర్సిరెడ్డి తదితర రైతులకు సంబంధించిన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ సందర్భంగా బుధవారం ఉద్యానవన శాఖ అధికారి హిమబిందు, ఏఈఓ రమణ, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ ఆయా గ్రామాలను సందర్శించి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. కాగా ఆగిర్యాల గ్రామంలో 27 మంది రైతులకు సంబంధించిన 28 ఎకరాల వరిపంట దెబ్బతిందని వ్యవసాయ విస్తరణాధికారి రమణ తెలిపారు. అలాగే 176 మంది కర్షకులకు సంబంధించి 216 ఎకరాల్లో మామిడి చెట్లకు కాయలు రాలిపోయాయని షాద్‌నగర్ ఉద్యానవన అధికారి హిమబిందు పేర్కొన్నారు.

విరిగిన బొప్పాయితోట

ఫరూఖ్‌నగర్ మండలంలోని దేవునిపల్లికి చెందిన జంగయ్య అనే రైతుకు సంబంధించిన బొప్పాయితోట గాలివానకు విరిగి పూర్తిగా నేలపై పడిపోయాయి. దాదాపు 70 శాతానికి పైనే రైతు నష్టపోయాడని ఉద్యానవన శాఖ అధికారి తెలిపారు. దెబ్బతిన్న పంటల వివరాలను రైతులవారీగా ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని పేర్కొంటున్నారు. అకాల వర్షాలకు తాము తీవ్రంగా నష్టపోయామని ప్రభుత్వం తమను ఆర్థికంగా ఆదుకోవాలని కర్షకులు కోరుతున్నారు.

కుటుంబ కలహాలతో పురుగు మందు తాగిన వ్యక్తి

చికిత్స పొందుతూ మృతి



వేణు (ఫైల్)

కేశంపేట: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని దత్తాయపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అయ్యవారి వేణు(32) డ్రైవర్‌గా పని చేస్తు భార్య లత, ఇద్దరు కుమారులతో కలిసి జీవిస్తున్నాడు. వేణు ప్రేమ వివాహం చేసుకొని కొద్దికాలం సంతోషంగా ఉన్నాడు. తదనాంతరం కుటుంబ విషయంలో అప్పుడప్పుడు భార్యాభర్తలు గొడవలు పడేవారు. ఇలా తగాదా జరిగినప్పుడు లత కొన్ని రోజులు ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయి మళ్లీ వచ్చేదని గ్రామస్తులు తెలిపారు. ఆమె ఇలా చేస్తుండటంతో వేణు మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మనోవేదనతో ఆయన మంగళవారం రాత్రి పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా డాక్టర్ల సూచన మేరకు ఉస్మానియాకి తీసుకెళ్లారు. అక్కడే చికిత్స పొందుతూ బుధవారం ఆయన మృతి చెందారు. మృతుడి తండ్రి నర్సింహాచారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరహరి తెలిపారు.

రోడ్డుపై ఆక్రమణల తొలగింపు



ఆక్రమిత నిర్మాణాలను జేసీబీతో తొలగిస్తున్న ట్రాఫిక్, మున్సిపల్ సిబ్బంది

చేవెళ్ల: మున్సిపాలిటీ కేంద్రంలోని జాతీయ రహదారిపై ఆక్రమిత కట్టడాలను తొలగించాలని టౌన్‌ప్లానింగ్ అధికారి మణిహారిక, ట్రాఫిక్ సీఐ వెంకటేశంలు హెచ్చరించారు. బుధవారం చేవెళ్లలో ప్రధాన రహదారిపై దుకాణాల ముందు ఆక్రమించిన స్థలాలను తొలగించే పనులు చేపట్టారు. ఇందులో భాగంగా బోర్డులు, కట్టడాలను మున్సిపల్ సిబ్బంది జేసీబీలతో తొలగించింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. రోడ్డుపై ఆక్రమణలతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పాడుతున్నాయని చెప్పారు. ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు కూడా రోడ్లపై పార్క్ చేయవద్దని సూచించారు. మున్సిపాలిటీ అభివృద్ధికి రోడ్ల విస్తరణ అవసరమని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రాఘవేందర్, ట్రాఫిక్ పోలీసులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

పరువు నష్టం కేసు వాయిదా

సిటీ కోర్టులు : తెలంగాణ రాష్ట్ర అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖపై సినీ నటుడు నాగార్జున దాఖలు చేసిన పరువు నష్టం కేసు విచారణ బుధవారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టు (స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్)లో జరిగింది. ఈ విచారణకు పిటిషనర్ నాగార్జునతోపాటు ప్రతివాది మంత్రి కొండా సురేఖ గైర్హాజరు కావడంతో వారి తరుపున న్యాయవాదులు పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన ప్రజాప్రతినిధుల కోర్టు విచారణను ఈ నెల 23కు వాయిదా వేసింది. సినీ అగ్రహీరో నాగార్జున కుమారుడు హీరో నాగచైతన్య–సమంత విడాకుల విషయంపై వ్యాఖ్యల నేపథ్యంలో కేసు నమోదైన విషయం విదితమే.

వక్ఫ్ సవరణ బిల్లుపై ప్రత్యేక ప్రార్థనలు

సాక్షి, సిటీబ్యూరో: వక్ఫ్ సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్ ఆధ్వర్యంలో మసాబ్‌ట్యాంక్‌లో మంగళవారం రాత్రి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ ప్రార్థనలకు రాష్ట్రం నలుమూలల నుంచి కారు, బైక్ ర్యాలీలతో ముస్లింలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. బిల్లు ఉపసంహరించుకునే వరకు వెనక్కి తగ్గేదే లేదని ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్ అన్నారు.

మంత్రాల నెపంతో గెంటేశారు!

కన్న తల్లిదండ్రులనే ఇంట్లోంచి వెళ్లగొట్టిన కొడుకులు

- ఆర్నెల్లుగా కూతురు వద్ద ఉంటున్న వృద్ధ దంపతులు
- తమకు న్యాయం చేయాలని ఆర్డీఓకు బాధితుల వేడుకోలు
- త్వరలోనే సొంతింటికి పంపిస్తామని అధికారుల హామీ



తమకు న్యాయం చేయాలంటూ గండిపేట తహసీల్దార్‌ను వేడుకుంటున్న బాలమల్లయ్య, శారద దంపతులు

మణికొండ: కుమారుల మూఢ నమ్మకం కన్న తల్లిదండ్రులనే ఇంట్లోంచి గెంటివేసే స్థాయికి దిగజార్చింది. క్షుద్ర పూజలు చేసి తన కుమారుడి మృతికి కారణమయ్యారనే అభాండాన్ని వేసి వృద్ధ దంపతులను ఇంటి నుంచి వెళ్లగొట్టిన ఘటన నార్సింగిలో వెలుగు చూసింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నార్సింగి మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన ఎర్రగొల్ల బాలమల్లయ్య (70), శారద (62) దంపతులు. బాలమల్లయ్య కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిగా పని చేసి పదవీ విరమణ పొందారు. వీరికి బాలరాజు, శివకుమార్, కృష్ణ ముగ్గురు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. ఆరు నెలల క్రితం బాలమల్లయ్య పెద్ద కొడుకు బాలరాజు కుమారుడు (13) అనారోగ్యంతో మృతి చెందాడు. ఇదే సమయంలో బాలమల్లయ్య దంపతుల గదిలో పసుపు, కుంకుమ, నిమ్మకాయలు కనిపించాయని, వారే క్షుద్ర పూజలు చేసి తమ కుమారుడి మృతికి కారణమయ్యారంటూ ఇంట్లోంచి గెంటేశారు. దీంతో వారు దిక్కుతోచని స్థితిలో హయత్‌నగర్‌లో ఉంటున్న తమ కూతురు వద్ద తలదాచుకుంటున్నారు.

న్యాయం చేయాలంటూ అధికారుల చెంతకు..

తమ కష్టార్జితంతో కట్టుకున్న ఇంట్లో నుంచి కుమారులు నింద మోపి గెంటేశారని.. తిరిగి తమను ఇంటికి చేర్చాలంటూ వృద్ధ దంపతులు అధికారులను ప్రాధేయపడుతున్నారు. తనకు ప్రతి నెలా వచ్చే పెన్షన్ పత్రాలను లాక్కున్నారని బాలమల్లయ్య ఆరోపించారు. గత ఆరు నెలలుగా కూతురు వద్ద తలదాచుకున్న వీరు.. తమకు న్యాయం చేయాలంటూ రాజేంద్రనగర్ ఆర్డీఓ వెంకట్‌రెడ్డి, నార్సింగి పోలీస్‌స్టేషన్‌కు, గండిపేట తహసీల్దార్‌ల చుట్టూ తిరుగుతున్నారు. తమ పేరి ట ఉన్న ఇంట్లోంచి గెంటివేయటం చట్ట ప్రకారం ఎలా చెల్లుతుందని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఎలాగైనా న్యాయం చేయాలని అధికారులను వేడుకుంటున్నారు. కాగా.. ఆర్డీఓ ఆదేశాలతో బుధవారం తన వద్దకు వచ్చిన వృద్ధ దంపతులను ఓదార్చిన గండిపేట తహసీల్దార్ ఎస్. శ్రీనివాస్‌రెడ్డి.. వీరిని నార్సింగిలోని ఇంటికి పంపించాలని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సురేష్‌ను ఆదేశించారు. ఒకటి రెండు రోజుల్లో పోలీసు బందోబస్తు మధ్య వారిని ఇంటికి చేర్చాలని అధికారులు భావిస్తున్నారు.

వాటర్ లైన్‌మెన్లతో జూమ్ మీటింగ్

సాక్షి, సిటీబ్యూరో: జలమండలి నీటి సరఫరాలో శాశ్వతంగా లో–ప్రెషర్ సమస్యను పరిష్కరించేందుకు వాటర్ లైన్‌మెన్లపై దృష్టి సారించినట్లు కనిపిస్తోంది. ఏకంగా ఎండీ అశోక్ రెడ్డి లైన్‌మెన్లతో జూమ్ మీటింగ్ నిర్వహిస్తున్నారు. తాజాగా బుధవారం డివిజన్ 18 పరిధిలోని లైన్‌మెన్లతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఒక్కో లైన్‌మెన్ ఎన్ని వాల్వ్‌లను ఆపరేట్ చేస్తారో వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బంది లేకుండా పనులు ఎలా చేయాలో చర్చించారు. ప్రతి లైన్‌మన్ ఆధీనంలో ఉన్న ఆపరేషన్ వాల్వ్‌ల సంఖ్య, నీటి సరఫరా చేసే క్యాన్ నంబర్లు, వాల్వ్ ఆపరేషన్ సమయాన్ని తగ్గించడం తదితర అంశాలపై లైన్‌మెన్లతో చర్చించారు. వీటితోపాటు మెట్రో కస్టమర్‌లో నమోదయ్యే సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి తీసుకోవాల్సిన చర్యలను జీఎంను అడిగి తెలుసుకున్నారు. ఈ జూమ్ మీటింగ్‌లో జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్, ఈఎన్సీ– డైరెక్టర్ ఆపరేషన్–2 వీఎల్ ప్రవీణ్ కుమార్, జీఎం, డీజీఎం ఇతర అధికారులు పాల్గొన్నారు

బైకును ఢీకొట్టిన వాటర్ ట్యాంకర్

భార్య మృతి..భర్తకు గాయాలు

మాదాపూర్: వాటర్ ట్యాంకర్ బైక్‌ను ఢీకొనడంతో మహిళ మృతి చెందిన సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం..బిహార్ రాష్ట్రానికి చెందిన శ్రీకాంత్ కుమార్ భార్య మనీషా కుమారితో కలిసి బుధవారం ఉదయం బైక్‌పై పర్వత్‌నగర్ నుంచి మైహోంభుజ అపార్ట్‌మెంట్‌కి వెళ్తుండగా..సైబర్ టవర్ ఎంట్రీ గేట్ వద్ద ఓ వాటర్ ట్యాంకర్ అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీకొంది. దీంతో ఇద్దరు బైక్‌పై నుంచి పడిపోగా మనీషాకుమారి పైనుంచి వాటర్ ట్యాంకర్ వెళ్లడంతో తీవ్రగాయాలై ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. శ్రీకాంత్ కుమార్ తల, చేతులకు స్వల్పగాయాలయ్యాయి. నిర్లక్ష్యంగా నడిపిన వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌ను కె.శ్రీనివాస్‌గా గుర్తించారు. పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కోపంతోనే వృద్ధురాలిని చంపేశాడు...

- కమలాదేవి హత్య కేసును ఛేదించిన పోలీసులు
- జువైనల్ హోంకు మైనర్ తరలింపు

కుషాయిగూడ: కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హెచ్‌బీకాలనీ, కృష్ణానగర్ రోడ్డు నెంబరు–5లో చోటు చేసుకున్న కమలాదేవి హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఆమె తిడుతుందనే కోపంతో కసి పెంచుకున్న మైనర్ బాలుడే ఆమెను హత్యచేశాడని, ఇందులో ఎలాంటి కుట్రకోణం లేదని తేల్చారు. నిందితుడితో పాటు హార్డ్‌వేర్ అండ్ ఎలక్ట్రికల్ షాప్ యజమానులు ప్రకాష్‌చౌదరి, లలిత్‌చౌదరిలను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిని సుదీర్ఘంగా విచారించారు. సీసీ పుటేజీలతో పాటు వారి కాల్ డేటాను పరిశీలించిన పోలీసులు చివరకు బాలుడే కమలాదేవిని హత్య చేసినట్లుగా నిర్ధారించారు. ఈ మేరకు అతన్ని జువైనల్ హోంకు తరలించారు. ఈ విషయాలను బుధవారం కుషాయిగూడ ఏసీపీ మహేష్‌కుమార్ మీడియాకు వెల్లడించారు. విషయం వెల్లడవడంతో పారిపోయేందుకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు వెళ్లి ట్రైన్ కోసం వేచి చూస్తున్న మైనర్ బాలుడిని అదుపులోకి తీసుకొని విచారించినట్లు తెలిపారు. కమలాదేవిని హత్య చేసిన విషయాలను బాలుడు వెల్లడించినట్లు ఏసీపీ పేర్కొన్నారు. మేడ్చల్ కోర్టులో హాజరు పరిచిన అనంతరం అతడి వద్ద నుంచి రక్తపు మరకల దుస్తులు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని జువైనల్ హోంకు తరలించినట్లు తెలిపారు.

దైవ సన్నిధానంలో సీఎస్ ప్రత్యేక పూజలు



ఫిలింనగర్: ఫిలింనగర్ దైవ సన్నిధానంలో బుధవారం సంకష్ట హరచతుర్థి సందర్భంగా వినాయకుడి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని విశేష మల్లె పుష్పార్చనతో పాటు 350 కిలోల బెల్లంతో అలంకరించారు. వేకువ జామునే పంచామృతాభిషేకం, పల్లకీ సేవ వైభవంగా జరిగింది. ప్రత్యేక పూజల్లో చీఫ్ సెక్రటరీ (సీఎస్) శాంతికుమారి పాల్గొన్నారు.

వేసవికాలం.. అప్రమత్తతే ముఖ్యం



షాద్‌నగర్‌లోని అగ్నిమాపక కేంద్రం



అపార్ట్‌మెంట్‌లో ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

- అవగాహనతోనే అగ్ని ప్రమాదాల నివారణ
- కొనసాగుతున్న జాతీయ వారోత్సవాలు

షాద్‌నగర్: వేసవికాలం నిత్యం ఏదో ఓ చోట అగ్ని ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. సరైన అవగాహన లేకపోవడం, నిబంధనలు పాటించకపోవడం ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. దీంతో విలువైన ఆస్తులు అగ్నికి ఆహుతవుతున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు ఏటా ఏప్రిల్ 14 నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక జాతీయ వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. ప్రమాదం జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు. ఇళ్లు, అపార్ట్‌మెంట్, వ్యాపార సముదాయాలు, పరిశ్రమల్లో ఎండాకాలంలో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంది. ప్రమాదాల నివారణ కోసం అగ్నిమాపక శాఖ అధికారులు తగిన సూచనలు, సలహాలు అందిస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాలి



వేసవిలో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువ. ప్రమాదాలపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. ప్రజలను అప్రమత్తం చేసేందుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం

– జగన్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్, షాద్‌నగర్

ఇవి గుర్తుంచుకోవాలి

- నాణ్యతతో కూడిన ఎలక్ట్రిక్ పరికరాలను ఉపయోగించాలి.
- వంట గదిలో గాలి, వెలుతురు ఉండేలా చూసుకోవాలి.
- సెలవులకు ఇతర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు ఇంటికి సంబంధించిన మెయిన్‌ను ఆఫ్ చేయాలి.
- గ్యాస్ వాడకం అయిన తర్వాత రెగ్యులేటర్ వాల్వును ఆఫ్ చేయాలి.
- పాఠశాలలు, ఆసుపత్రులు, హోటళ్లలో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు క్షేమంగా బయట పడేందుకు సరైన ప్రణాళికలను ముందుగానే తయారు చేసుకోవాలి. ఫైర్ సేఫ్టీ పరికాలను అమర్చుకోవాలి.
- ఇళ్లు, కార్యాలయాల్లో ఏసీలు, ఇతర విద్యుత్ ఉపకరణాలల్లో ఎలాంటి లోపాలు తలెత్తకుండా క్రమం తప్పకుండా పరీక్షించాలి.
- అగ్ని ప్రమాదాలు జరిగితే ఫైర్ అలారం మోగించాలి.
- పరిశ్రమల్లో విద్యుత్ ఉపకరణాల్లో స్పార్కులు, షార్ట్ సర్క్యూట్, ఓవర్ లోడింగ్ లేకుండా చూసుకోవాలి

వారోత్సవ కార్యక్రమాలు ఇవే

- 17న ఆసుపత్రుల్లో సిబ్బందికి తరగతులు నిర్వహించడం, మాక్ డ్రిల్ ప్రదర్శనలు
- 18న పరిశ్రమలు, పెట్రోల్ బంకులు, గ్యాస్ గోదాముల్లో అవగాహన కార్యక్రమాలు
- 19న ఫంక్షన్ హాళ్లు, పాఠశాలల్లో ఫైర్ సేఫ్టీ తనిఖీలు
- 20న రాజకీయ పార్టీల ప్రతినిధులతో అగ్ని ప్రమాద కార్యాలయంలో ప్రమాదాల నివారణపై శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు.